క్లుప్తంగా

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



విగ్రహానికి అభిషేకం చేస్తున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మండలంలోని చోడవరం పంచాయతీ గెడ్డవానిపేటలో సుందర అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. సోమవారం నుంచి ప్రతిష్ట మహోత్సవాలు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. చివరి రోజు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. అభయాంజనేయ స్వామి విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం రుత్వికులు శాంతి హోమం, యంత్ర ప్రతిష్ట చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పారశిల్లి ఎంపీటీసీ సభ్యుడు పంగ శ్రీరాములు, అంపోలు సుధ, తదితరులు పాల్గొన్నారు.

అధిక యూరియాతో అనర్థం



ధర్మలక్ష్మీపురంలో మాట్లాడుతున్న ఏడీ మధు

సారవకోట: వరి పంటలో యూరియా వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ శాఖ ఏడీ మధు సూచించారు. మండలంలోని ధర్మలక్ష్మీపురం, మాళువ రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. వరిలో యూరియా అధికమైతే తేలికపాటి గాలులకు మొక్క పడిపోతుందన్నారు. నేల సారం తగ్గిపోతుందన్నారు. వ్యవసాయాధికారి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామారావు

పాతపట్నం: ఇంటి నుంచి బయలుదేరి పాఠశాలలకు వస్తున్న విద్యార్థినులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం సీఐ వి.రామారావు సూచించారు. మండలంలోని ప్రహరాజపాలెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై బుధవారం అవగాహన కల్పించారు. పరిచయంలేని వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. కొత్త వ్యక్తుల పట్ల ఆకర్షితులు కావద్దని, సోషల్ మీడియాలో లేనిపోని పరిచయాలు పెంచుకోవద్దని, చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.


కేంద్రం దృష్టికి గిరిజనుల సమస్యలు



వినతిపత్రం అందిస్తున్న జిల్లా గిరిజన ఐక్యవేదిక సభ్యులు

సారవకోట: జిల్లాలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంట్ ఎస్సీ, ఎస్టీ శాఖ వ్యవహారాల చైర్మన్ కులస్తే దృష్టికి గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు చౌదరి లక్ష్మీనారాయణ తీసుకెళ్లారు. బుధవారం ఢిల్లీలోని చైర్మన్ నివాసంలో గిరిజన ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు వివేక్ వినయ్‌తో కలిసి జిల్లాలోని పలు గిరిజన గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని లక్ష్మీనారాయణ తెలిపారు.

రికార్డులను సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఏపీఓ శ్రీదేవి

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో ఏడాదిగా చేపడుతున్న ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులన్నీ సిద్ధం చేయాలని ఏపీఓ కె.శ్రీదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే మండలంలోని ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించేందుకు సోషల్ ఆడిట్ బృందం రానుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులన్నీ ఒకసారి సరి చూసుకోవాలన్నారు. లేకుంటే వాటికి మీరే బాధ్యులవుతారన్నారు. ఈసీ సింహాచలం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులేవి బాబూ?



- ముందుకు సాగని ప్రభుత్వ కాలనీల నిర్మాణాలు
- రోడ్లు, తాగునీరు, విద్యుత్, ఇతర సౌకర్యాలు కరువు
- ఇళ్ల నిర్మాణానికి ముందుకురాని లబ్ధిదారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

పాలవలసలో సగంలోనిలిపోయిన కాలనీ ఇళ్లు

సరుబుజ్జిలి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరుచేసిన కాలనీలకు ప్రస్తుత ప్రభుత్వం గ్రహణం పట్టించింది. ఆశించిన స్థాయిలో నిర్మాణాలు ముందుకు సాగక, సకాలంలో బిల్లులు రాక ప్రభుత్వ లక్ష్యానికి గండిపడింది.

సకాలంలో మంజూరు కాని బిల్లులు

గృహ నిర్మాణ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు మంజూరు కావడంలేదు. దీనివలన లబ్ధిదారులు ఇంటి పనులు చేపట్టేందుకు ముందుకు రావడంలేదు. ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు ఆకాశన్ని అంటుతున్నాయి. దీని వలన కూడా ఆశించిన స్థాయిలో నిర్మాణాలు జరగడం లేదు.

మౌలిక వసతుల కరువు

తాంబూళాలు ఇచ్చేశాం.. తన్నుకు చావండి అన్న రీతిలో కూటమి ప్రభుత్వం లబ్ధిదారులతో చెలగాటమాడుతుంది. అక్కడక్కడ కాలనీ నిర్మాణాలు చేస్తున్నప్పటికి.. వారికి ఇప్పటికీ మౌలిక వసతులు కల్పించలేదు. పాలవలస, నందికొండ, మతలబుపేట గ్రామాల్లోని కాలనీల్లో తాగునీరు, రహదారుల సదుపాయాలు లేకపోవడం వలన నివాసదారులు నానా అవస్థలు పడుతున్నారు. రహదారులు లేక వర్షా కాలంలో కాలు బయటపెట్టేందుకు ఇబ్బంది పడుతున్నారు.

ఆమదాలవలస నియోజకవర్గంలో కాలనీ ఇళ్ల నిర్మాణాల వివరాలు ఇలా..			
మండలం	మంజూరైన ఇళ్లు	ప్రారంభం కానివి	వివిధ దశల్లో ఉన్నవి
ఆమదాలవలస	1,525	303	190
సరుబుజ్జిలి	1,079	136	106
పొందూరు	1,896	317	379
బూర్జ	1,634	482	141



రోడ్లుకు నోచుకోని పాలవలస కాలనీ



యరగాంలో పునాదుల దశలో ఉన్న ఇల్లు

వసతులు లేవు

కాలనీల నిర్మాణాలు కొన్నిచోట్ల జరిగినా మౌలిక వసతులు కల్పనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇంటిని మంజూరుచేసిన తరువాత వారి సదుపాయాలు గురించి అధికారులు పట్టించుకోవడంలేదు. దీని వలన నిర్మాణదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

– సురవరపు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు, సరుబుజ్జిలి

బిల్లులు సకాలంలో రావడంలేదు

కాలనీ ఇళ్లు నిర్మించిన వారికి సకాలంలో బిల్లులు మంజూరు కావడంలేదు. ఫైనాన్స్ వ్యాపారుల వద్ద రుణాలు తీసుకొని వడ్డీలు కట్టలేక నరకయాతన పడుతున్నాం. దీనివలన సగంలో నిర్మాణాలు ఆపేసిన పరిస్థితులున్నాయి. బిల్లులను వెంటనే చెల్లించాలి.

– జి.గోవిందమ్మ, లబ్ధిదారు, పాలవలస, సరుబుజ్జిలి మండలం

బిల్లుల సమస్యలు పరిష్కరిస్తాం

లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలకు సంబంధించిన వివిధ స్టేజీల వారీగా బిల్లులు చెల్లింపులు చేపడుతున్నాం. నిర్మాణం పూర్తయిన వెంటనే పరిశీలన చేసి బిల్లులు జనరేట్ చేస్తున్నాం.

– ఎస్.ధర్మారావు, ఇన్‌చార్జి ఏఈ, హౌసింగ్, సరుబుజ్జిలి

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి

- రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న కాంతారావు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని, రుచి, శుచిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వంట మహిళలకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని అధికారులకు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు ఆదేశించారు. నరసన్నపేట మండలంలో బుధవారం పర్యటించారు. పలు స్కూళ్లల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ, కేంద్రాల నిర్వహణ, రేషన్ డిపోల్లో బియ్యం పంపిణీ, వృద్ధులకు ఇంటింటికీ బియ్యం పంపిణీ విధానాలను పరిశీలించారు. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం అమలుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు వివరించారు. వంట చేసే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు స్కూళ్లను పరిశీలించాలన్నారు. బియ్యం పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా డీలర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. వృద్ధులకు వారి ఇళ్ల వద్దకే బియ్యం అందజేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీఎస్‌ఓ జి.సూర్యప్రకాశ్, తూనికలు, కొలతల అధికారి ఎ.బలరాం, నోడల్ అధికారి పి.మణిమ్మ, ఎంఈఓ శాంతారావు, ఐసీడీఎస్ పీఓ భాగ్యలక్ష్మి, డీటీలు రామకృష్ణ, జాఫర్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం



హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలం యంబరాంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ షళంత్రి సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.జానకి అన్నారు. మండలంలోని సింధువాడ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ రాజకుమారి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హిరమండలం: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఎల్.ఎన్.పేట మండలంలోని యంబరాంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బూర్జ: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్టు, బూర్జ సెక్టార్ సూపర్‌వైజర్ టి.రత్నం అన్నారు. బూర్జలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పాతపట్నం: తల్లి పాలతో శిశువుకు సమతుల్యమైన ఆహారం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనూరాధ అన్నారు. మండలంలోని సోధ అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ సవర ఆనంద్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు

నరసన్నపేట: అర్హత కలిగిన ప్రతి కౌలు రైతుకీ వ్యవసాయ రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు సూచించారు. కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వనుందని, వీటిని పొందిన రైతులందరికీ రుణాలు ఇవ్వాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం అమలుకు బ్యాంకర్లు సహకరించాలని పలు యూనిట్ల ఏర్పాటుకు రుణాలు ఇవ్వాలన్నారు. స్థానిక ఐకేపీ భవనంలో బుధవారం నియోజకవర్గస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పీఎంజేడీవై, పీఎంజేజేబీవై, పీఎం ఎస్‌బీవై, ఏపీవై వంటి పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్‌పెన్యూర్‌లో భాగంగా స్వయం శక్తి సంఘాలకు రుణాలు ఇవ్వాలన్నారు. డిజిటల్ సూక్ష్మరుణ ప్రణాళిక అమలు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. నాబార్డు మేనేజర్ రమేష్‌కుమార్, బ్యాంక్ లింకింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నాగమణి, స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్షణం.. క్షణం.. భయం.. భయం



- భయాందోళనలో వంశధార నదీతీర గ్రామాలు
- కోతకు గురవుతున్న నదీతీరం
- 50 మీటర్ల వరకు కోత
- గ్రోయిన్స్ నిర్మించాలని వినతి

ఉప్పరపేట వద్ద కోసుకుపోతున్న నది ఒడ్డు

జలుమూరు: వర్షాకాలం వస్తేచాలు వంశధార నదీ తీర గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు ఉండదు. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు నదీతీర గ్రామాలకు వరద భయం ముంచుకువస్తోందని క్షణం.. క్షణం.. భయం.. భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ప్రధానంగా ఈ గ్రామాలకు ఆనుకొని కరకట్టల నిర్మాణం జరగకపోవడం, నదిలో ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వడం, ప్రవాహం ఉన్నచోట గ్రోయిన్స్ నిర్మాణం చేయకపోవడంతో ప్రతిఏటా వరద ముంపుతో పాటు ఇళ్లవరకు గట్టు కొట్టుకుపోతుందని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు.

నదీతీర గ్రామాలు 30..

వంశధార నదీతీర గ్రామాలు ఇటు నరసన్నపేట, అటు జలుమూరు, పోలాకి మండలాల్లో 30 వరకు ఉన్నాయి. ఇందులో అత్యంత ప్రమాదకరంగా ఉన్నవి గెడ్డవానిపేట, వెంకటాపురం, కొబగాం, అంధవరం, ఉప్పరపేట, రామకష్టాపురం, పర్లాం, గొల్లపేట, డోలపేట, బుచ్చిపేట, డోల, గోవిందపురం, రేవు అంప్లాం, వనిత మండలం, తదితర గ్రామాలున్నాయి. నదిలో ప్రవాహం ఎక్కువైతే చాలు గట్టు కొట్టుకుపోయి గ్రామాల్లోకి నీరు ప్రవేశిస్తుంది.



అంధవరం వద్ద ప్రమాదకరంగా ఉన్న గట్టు (ఫైల్)

కట్టని కరకట్టలు..

వరద నివారణతోపాటు పంట పొలాలను రక్షించేందుకు వంశధార నదికి ఆనుకొని ఉన్న గ్రామాల పక్కన కరకట్టలు కడతామన్న ప్రతిపాదనలు ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. 2011లో కరకట్టల నిర్మాణాలకు సుమారు రూ.52 కోట్లు నిధులు మంజూరయ్యాయి. 15 శాతం నిర్మాణాలు కూడా జరిగి.. అక్కడితో పనులు ఆగిపోయాయి. దీంతో ఏటా పంట మునిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కరకట్టల నిర్మాణంతోపాటు ముంపు వద్ద గ్రోయిన్స్ నిర్మాణం చేపట్టాలని నదీతీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదం అంచున ఉన్నాం..

నదికి రెండు మీటర్ల దూరంలో ఉన్నాం. చిన్నపాటి వరద వస్తే చాలు ఇళ్లల్లోకి నీరు వస్తుంది. ఒకటి, రెండుసార్లు పశువులు, మేకలు కూడా వరదకు కొట్టుకుపోయిన సందర్భాలున్నాయి.

– ఎ.సత్తివాడు, ఉప్పరపేట, జలుమూరు మండలం

గ్రోయిన్స్ నిర్మించాలి

తమ గ్రామ సమీపంలో వంశధార నది ఉంది. గ్రోయిన్స్ నిర్మాణం చేపట్టాలి. ఇంకా రెండు, మూడుసార్లు వరదలు వస్తే ప్రమాదం తప్పదు. మాకే కాదు నదీతీర గ్రామాల ప్రజలందరూ అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రోయిన్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– అంధవరపు రాము, రామకృష్ణాపురం, జలుమూరు మండలం

'మోసం చంద్రబాబు నైజం'



ఆమదాలవలస: తోటవాడలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా.. అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలంలోని తోటాడ, అక్కివరం గ్రామాల్లో బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ, రికాలింగ్ మ్యానిఫెస్టో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, పార్టీ మండల అధ్యక్షుడు తమ్మినేని సీరామ్మూర్తి, పార్టీ నాయకుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. సరుబుజ్జిలి మండలంలోని మతలబుపేట, గోనెపాడు గ్రామాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమానికి చింతాడ రవికుమార్ హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు, నాయకులు పున్నపురెడ్డి తవిటినాయుడు, సనపల తవుడు, వీరఘట్టపు కృష్ణ, మామిడి తిరుపతిరావు, మూడడ్ల రమణ పాల్గొన్నారు. బూర్జ మండలంలోని అల్లెన గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ బెజ్జిపురం రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తినాయుడు, అల్లెన సర్పంచ్ జడ్డు మహేశ్వరరావు ఆధ్వర్యంలో, హిరమండలం మండలంలోని పెద్దగూడ పంచాయతీ పరిధిలోని పెద్దగూడ, దబ్బగూడ, ఎగువగూడ గిరిజన గ్రామాల్లో పార్టీ మండల ఉపాధ్యక్షుడు పెద్దింటి గోపాలం ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: మతలబుపేటలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు



బూర్జ: అల్లెనలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హిరమండలం: పెద్దగూడలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రపంచ శాంతిని కోరుదాం

ఆమదాలవలస: జపాన్‌లోని హిరోషిమా నగరంపై జరిగిన అణు బాంబు దాడిని గుర్తిస్తూ ప్రతి సంవత్సరం ఆగస్టు 6న నిర్వహించే హిరోషిమా డే సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతిని కోరుకోవాలన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో హిరోషిమాపై అమెరికా జరిపిన అణు బాంబు దాడి మానవాళి చరిత్రలో భయానక ఘట్టమని, యుద్ధాల వల్ల ఎంత భారీ నష్టం జరుగుతుందో కళ్లకు కట్టినట్లు చూపించిందన్నారు. 'యుద్ధం వద్దు – శాంతి కావాలి' అంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు నినాదాలు చేశారు. జేవీవీ ప్రతినిధులు పాల్గొన్నారు.

12న డీ వార్మింగ్ డే..



ఎంఈఓకు మాత్రలు అందజేస్తున్న వైద్యాధికారి శిరీష

నరసన్నపేట: ఈ నెల 12న డీ వార్మింగ్‌డే నిర్వహిస్తున్నామని, అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగులు మాత్రలు పంపిణీ చేయనున్నామని ఎంఈఓ శాంతారావు తెలిపారు. మండలంలో 19 వేల మంది విద్యార్థులకు ఈ మాత్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికీ నులి పురుగుల మాత్రలు పంపిణీ చేయాలని పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. స్కూళ్లకు ఈ మేరకు మాత్రలు పంపిణీ చేశారు. పాఠశాలల్లో ఈ మేరకు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ రేణుక, మాకివలస వైద్యాధికారి శిరీష, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌కుమార్

డీ వార్మింగ్ డే విజయవంతం చేయాలి..

సారవకోట: ఈ నెల 12న నిర్వహించనున్న డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని వైద్యులను ఎంపీడీఓ మోహన్‌కుమార్ సూచించారు. బుధవారం తన కార్యాలయంలో సారవకోట, బొంతు పీహెచ్‌సీ వైద్యులు, అంగన్‌వాడీ, ఎంఈఓలతో కార్యక్రమ నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు అర మాత్ర వేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పరామర్శ..



బొత్తాడసింగిలో సర్పంచ్ చిన్నారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని బొత్తాడసింగి గ్రామానికి చెందిన గుమ్మడి రామకృష్ణ ఇటీవల పాము కాటు గురై మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం పరామర్శించారు. బొత్తాడసింగి గ్రామ సర్పంచ్ ఈగల చిన్నారావుపై ఎరువుల పంపిణీ వద్ద టీడీపీ నాయకులు ఇటీవల దాడి చేశారు. చిన్నారావు ఇంటికి వెళ్లి పరామర్శించి, అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు పెను మజ్జి విష్ణుమూర్తి, ప్రత్యేకాహ్వానితుడు రెడ్డి రామారావు, జిల్లా అధికార ప్రతినిధి సిమ్మ సాంబశివరావు, నాయకులు లోచర్ల మల్లేశ్వరరావు, చెట్టు రాము, తదితరులు ఉన్నారు.



చినఅప్పలనాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

సరుబుజ్జిలి: మండలంలోని పాతపాడు గ్రామానికి చెందిన టంకాల చినఅప్పలనాయుడు, మతలబుపేటకు చెందిన కిల్లి లక్ష్మణరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, పున్నపురెడ్డి తవిటినాయుడు, మూడడ్ల రమణ, తదితరులు ఉన్నారు.